# స్వప్నరాగిణి

కె. తాయారమ్మ

**అతని** కళ్ళు ఆలోచిస్తూ ఉంటాయి. అతని ఊహలు అనంత విశ్వాన్ని పరిశీలిస్తూ ఉంటాయి. అతని గుండె చప్పుళ్ళు అతనికే వింతగా వినిపిస్తూ ఉంటాయి.

అతనా ఊరికి కొత్త.

ఎప్పుడూ ఏటి ఒడ్డున కూచుంటూ ఉంటాడు. పెరిగిన గెడ్డం, చిరిగిన బట్టలు, పేదరికానికి ప్రతినిధిలా ఉన్నాడతను. నిరుద్యోగ పర్వంలో విసిగి వేసారి జీవితం నుంచి దూరంగా పారిపోయి వచ్చినట్టున్నాడు.

అతని చూపులు జీవిత సత్యాల్ని వెతుకుతూ ఉంటాయి. ఎండి బీటలు వారిన అతని పెదవుల మీద నవ్వు మచ్చుకైనా కానరాదు.

అతను కళాకారుడు.

కళ జీవితానికి వెలుగు నిచ్చినా, మనుగడకి మాత్రం తావివ్వదు. చిత్రాలు గియ్యడంఅతని హాబీ. రంగులు, కుంచెలూ, విలువైన సామగ్రీ కొనుక్కునే శక్తి లేదు అతనికి. కాని అతని అంతరంగం అందానికి రూపులు దిద్దుతుంది. చూపుల కుంచెలతో భావాల బొమ్మలు గీస్తాడు అతను.

జీవిత గమ్యం తెలియని పాంథుడతను. అతనా ఊరు వచ్చిన రోజు ఒక పెద్ద ఇంటి గడపలో శోష వచ్చి పడిపోయాడు.

అది భూకామందు గంగారాం గారి మూడంతస్తుల మేడ.

మేడ ముందు జనం గుమిగూడారు. "ఎవరు?" అందరి మనస్సుల్లోనూ ఉదయించిన ఒకే ఒక ప్రశ్న.

"ఎవరో బాటసారి. మూర్ఛవచ్చి పడిపోయాడు. కాసింత కూడు బెట్టి లేవదియ్యి" అన్నాడు గంగారాం - పాలేరు నర్సిగాడితో.

అప్పుడు చూసింది ఆమె అతన్ని. మబ్బుల్లో చందమామలా వెలిగి పోతున్నాడతను. ఏ ఇంట పుట్టిన బిడ్డో? - "మట్టిలో మాణిక్యంలా ఉన్నాడు" అనుకుంది.

ఆమెనుంచి గాఢమైన నిట్టూర్పు వెలువడింది. పద్దెనిమిదేళ్ళ ఆ ఎల జవ్వని గంగారాం గారి పడుచు భార్య.

గంగారాం మీసాలకి రంగు వేసుకుంటాడు. కట్టుడు పళ్ళతో వృద్ధాప్యాన్ని కప్పిపుచ్చుకోవాలనుకుంటాడు. ఆయనకి ఆ ఊళ్ళో రెండు వందల ఎకరాల మాగాణి ఉంది. ఎన్నో మామిడి, జీడి తోటలున్నాయి. ఆయన తలుచుకుంటే ఏమైనా చెయ్యగలడు. అతగాడికి తెలివి వచ్చేక అడిగేడు గంగారాం - "ఏ ఊరు మన్ది?" అని.

అతను వేదాంతిలా నవ్వాడు.

చిత్రంగా చూశాడు గంగారాం - "మాటలు రావా?"

"బ్రతుకు తెరువు వెతుక్కుంటూ ఇలా వచ్చాను- పనేదైనా ఉంటే ఇప్పించండి!"

"ఈ పల్లెటూళ్ళో ఏం పని సేత్తావు? సూడబోతే చదువుకున్నోళ్ళావున్నావు" అన్నాడు గంగారాం - చుట్ట తీసి తుపుక్కున ఉమ్మి, మళ్ళీ నోట్లో పెట్టుకుంటూ.

"ఏ పనైనా సరే!" సిగ్గు పడుతూ అన్నాడు.

"మా కూలీల మీద అజమాయిషీ చెయ్యి! కూడూ, గుడ్డా ఇత్తాను."

లోతుకు పోయిన అతని కన్నులలో సన్నని వెలుగు కదలాడింది.

"రేపే పన్లో జేరు! మా జీడి తోట్లో పాకలో ఉండు!" గంగారాం లోపలికి నడిచాడు.

అతను మెల్లగా కదిలాడు అక్కడి నుంచి.

** ** **

ఏటి ఒడ్డున కూర్చుని చిన్న చిన్న గులక రాళ్ళు ఏరి నీళ్ళలో వేస్తున్నాడతను.

సంధ్య ఏటి నీళ్ళలో సోకు చూసుకుంటోంది. అతను ఇప్పుడు కడుపు నిండా అన్నం తింటున్నాడు. కంటి నిండా నిద్ర పోతున్నాడు.

సాయంకాలం ఏటి నీళ్ళకొచ్చే పల్లె పడతుల అందాలు అతనికి చక్కిలిగింతలు పెడుతున్నాయి. గిరిజన యువతులు కడవలు నెత్తిన పెట్టుకుని నడుస్తూంటే వాళ్ళ కాళ్ళ సత్తు కడియాల సవ్వడులు వింటున్నాడు.

ఆ దృశ్యం అతనిలో బొమ్మలు గీయిస్తోంది.

ఆ రాత్రి దాన్ని బొమ్మ గీశాడు. ఏటి నుంచి కడవలతో నీళ్ళు తీసుకు వెళ్తున్న గిరిజన స్త్రీల చిత్రం అది.

అతని హృదయం తృప్తిగా నిట్టూర్చింది. రంగులు కొన్నాడు. మేళవిస్తున్నాడు. బొమ్మలు గీస్తున్నాడు.

"కుర్రాడా! నువ్వు బొమ్మలు గీస్తావా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు గంగారామ్. నవ్వాడతను.

ఆ రోజు ఉదయం అతని జీవితంలో ఒక మహోన్నతమైన రోజు. ఏటి ఒడ్డున కూచునున్నాడు. లేత నీరెండ ఏటి నీళ్ళ మీద పడి తళతళమెరుస్తోంది.

చిన్న బిందెతో నీళ్ళకొచ్చి పొడవాటి కురులు విప్పి నీటిలో స్నానమాడి బిందెతో నీళ్ళు తీసుకుందా చిన్నది. ఇతన్ని చూస్తూనే నిలుచుండిపోయిం దామె. అజంతా శిల్పంలా ఉన్న ఆ యువతిని చూస్తూ రెప్ప వెయ్యడమే మరిచిపోయాడతను.

ఆమె కదిలింది. పిరుదుల్ని దాటి వ్రేలాడుతున్న ఆ తల వెంట్రుకల్ని చూస్తూ

"ఏమండీ! మీరు...మీరు...ఒక్కసారి అలా నిలబడండి." అర్థింపుగా అన్నాడు.

"మీరెవరు?" చిరుకోపం నటిస్తూ ప్రశ్నిం దామె.

"నేనొక కళాపిపాసిని! ప్లీజ్! ఒక్కసారి అలా నిలబడండి."

"ఇప్పుడు కాదు!" అంటూ హడావిడిగా వెళ్ళిపోయిందామె.

"ఇది కలా, నిజమా?" అతను తేరుకునేసరికి చాలా సేపు పట్టింది.

ఈ చిత్రాన్ని గియ్యగలిగితే తను సఫలీకృతుడే! తన జీవితం సార్థక్యాన్ని సంతరించుకుంటుంది.

అతని ముఖంలో ఆనంద వీచికలు తారట్లాడాయి.

** ** **

"మీ చిత్రాన్ని గియాలనుకుంటున్నాను" ఏటి నీటిలో తల నిండుగా స్నానం చేసి ఇవతలకు వస్తున్న ఆమెతో అన్నాడు అతను.


పసుపు పూసుకున్న ముఖంలో ఆశ్చర్యం తొణికిసలాడింది.

"నిజం! మీ అందాన్ని బొమ్మ గియ్యాలి. అప్పుడే నా జన్మ తరిస్తుంది."

నవ్విందామె. తెల్ల దానిమ్మ గింజల్లాంటి పళ్ళు తళుక్కున మెరిశాయి. శిరోజాల నిండుగా నీరు ధారలు కడుతూంది. తడిసిన చీరలో శిల్పంలా ఉందామె.

"ఏమండీ! ప్లీజ్!" అభ్యర్థన తొంగిచూసింది అతని పిలుపులో.

మౌనంగా నడిచి వెళ్ళిపోయిందామె. అతను ఖంగుతిన్నాడు. జీడి తోటకి నడిచాడు. కేన్వాస బోర్డు తీశాడు. రంగులు మేళవించాడు. కుంచెలు ముంచాడు. బోర్డు మీద గీశాడు... కాని... బొమ్మ





గియ్యలేకపోయాడు. మనసులో నిలిచిన విద్యుల్లత బొమ్మ రూపాన్ని సంతరించుకోలేకపోయింది.

అతని హృదయంలో సన్నని బాధ తొణికిసలాడింది.

"ఇదేమిటీ వైపరీత్యం? మనస్సులోని భావాలకి రూపాన్ని దిద్దే కుంచె నిస్సత్తువగా, నీరసంగా జారిపోయింది."

శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడు అతను.

"ఆర్టిస్టుగారూ!" వీణ మీటినట్టున్న ఆ పిలుపుకి అటు తిరిగాడు అతను.

సమయం రాత్రి తొమ్మిది గంటలయింది. సోయగాలు రాశి పోసినట్టు ఆమె. అతని కళ్ళు అతన్నే నమ్మలేకపోయాయి.

"మీరు... మీరు... ఇక్కడికి... ఈ సమయంలో..." నసిగాడు అతను.

"మీరు నా బొమ్మ గీస్తానన్నారుగా?" ఓరకంట చూస్తూ అన్నదామె.

"మీ పేరు?" అడిగాడు అతను.

"అహల్య!" నవ్వుతూ చెప్పింది.

"చక్కటి పేరు!" ప్రశంసా పూర్వకంగా ఆమె వైపు చూశాడు.

"నేను చక్కగా లేనా?" చిలిపిగా చూస్తూ ప్రశ్నించింది.

"మిమ్మల్ని వర్ణించడానికి నేను కవిని కాను. చిత్రకారుణ్ణి. బొమ్మ గీసి చూపిస్తాను."

"మరి గియ్యండి!"

"ఇక్కడ కాదు!"

"మరి ఎక్కడ?"

"ఉదయ సూర్యుడు తూరుపు కొండ మీంచి తొంగి చూస్తూంటే, మంచుతో తడిసిన రెల్లు పువ్వులా మీరు ఏటిలో స్నానమాడి వస్తూంటే, పిరుదులు దాటి వ్రేలాడే మీ తల వెంట్రుకలను, మబ్బులు వీడి వెలుగొందే చందమామలా ఉన్న మీ మోమునీ చూస్తూ బొమ్మ గీస్తాను."

గలగల నవ్విందామె.

"కవిత్వం రాదన్నారు?"

సిగ్గుతో తల వంచుకున్నాడతను.

"మగవాళ్ళు సిగ్గుపడుతూంటే తమాషాగా ఉంటుంది!" మరోసారి నవ్వింది.

మర్నాడు ఉదయం అతను సిద్ధంగా ఉన్నాడు. రంగులతో, కుంచెలతో, కేన్వాసు బోర్డుతో.

ఆమె వచ్చింది. స్నానమాడి తడి బట్టలతో, చంకన బిందె నెత్తుకుని నిలుచుంది. ఏటి నీటిలో ఒక అడుగు, బైట ఒక అడుగు.

సౌందర్యాల ప్రోవులా, అందాల రాశిలా, కాంతిపుంజంలా, మూర్తీభవించిన కవితా

కన్నియలా నిలుచుంది. రెప్పవెయ్యకుండా అలా చూస్తూ ఉండిపోయాడు.

నవ్విందామె. తనను తాను నంబాళించుకున్నాడు.

"క్షణ కాలం అలాగే నిలబడండి ప్లీజ్!" రంగులలో కుంచె అద్దాడు. బొమ్మ మొదలైంది. ఆమెను ఒకసారి చూస్తున్నాడు. బొమ్మ గీస్తున్నాడు.

ఉన్నట్టుండి ఆమె కదిలింది. కాలి అందెల చిరు మువ్వలు నవ్వడి చేశాయి.

గంగారామ్ ఏటి కట్టవైపు నడిచి వస్తున్నాడు. గతుక్కుమన్నాడు అతను.

ఆమె కనుమరుగైంది.

ఆదిలోనే హంనపాదు. బొమ్మ మొదట్లోనే ఆగిపోయింది.

"ఏం కుర్రాడా, ఏటి ఒడ్డున కూర్చుని ఏం సేత్తాన్నావు? బొమ్మలు గీత్తన్నావా? ఎల్లెల్లు తోటకాడికి వెళ్ళిపో!" వేప పుల్ల నోట్లో పెట్టుకు వళ్ళు తోముకుంటూ సాగిపోయాడు గంగారాం.

ఆ సాయంత్రం జీడి తోటకి వచ్చింది ఆమె.

"అహల్యా! అలా వెళ్ళిపోయారేం? మీరు నాతో నహకరి స్తే గానీ బొమ్మ గియ్యలేను! వారం రోజుల పాటు మీరు ఆ భంగిమలో అలా అక్కడే అలా కొద్ది క్షణాలు నిలుచుంటూ ఉండాలి!"

నవ్విందామె. ఈసారి విషాదంగా. "ఇక ఏటికి వస్తానో, రానో!"

"ఏం, ఎందుకని?"

"ఆయన చూశారు!"

"ఆయన ఎవరు?"

"గంగారాం గారు!"

"గంగారాం గారు చూ స్తే ఏం?"

"ఆయన నా భర్త!"

అతని చేతిలో కుంచె జారిపోయింది. రంగులు తొణికి అల్లకల్లోలమైపోయాయి.

"ఏం! అలా అయిపోయారు?"

"కొన్ని నిజాల్ని తట్టుకోవడం కష్టం!"

"మీ పేరు చెప్పారు కారు!" నంభావణ మార్చే ఉద్దేశంతో అడిగిందామె.

"శిల్పి!"

"తమాషాగా ఉంది. ఇంతకీ చిత్రం ఎంత వరకు వచ్చింది?"

"చిత్రం పాడైంది. మళ్ళీ గీస్తాను. రేపు ఉదయం ఏటికి వస్తారా?"

"ప్రయత్నిస్తాను!" గిర్రున వెనుదిరిగి వెళ్ళిపోయిందామె.

ఆమె శాపగ్రస్తలా అనిపించింది అతనికి. ఏ ఘోర శాపానికి గురి అయి, భూలోకంలో అవతరించిన దేవకన్యో ఈమె? గాఢమైన నిట్టూర్పు వెలువడింది అతని నుంచి.

ఆమె వెళ్ళిన వైపే చూస్తూ ఉండిపోయాడతను.

మర్నాడు బాల భానుడు తూర్పు కొండపై పొడుస్తున్న వేళ వచ్చిందామె ఏటికి స్నానానికి.

ఆమె మోము చిన్నబోయి ఉంది. మౌనంగా నిలుచుంది అతన్నే చూస్తూ.

"ఇలా కాదు! నిన్నటిలా?" నవ్వుతూ అన్నాడు.

ఆమె నేత్రాలనుంచి అశ్రుకణాలు జలజల రాలాయి.

అతను ఆశ్చర్యంగా, ఆందోళనగా చూశాడు. వెనువెంటనే తేరుకుని నవ్విందామె.

"వేగం బొమ్మ గియ్యండి! నేవెళ్తాను." ఒక్కసారి నీళ్ళలోకి దిగి స్నానం చే సి వచ్చి అదే భంగిమలో నిలుచుంది. అతను కాలాన్ని వృధా చెయ్యదల్చుకోలేదు.

అవుట్ లైన్స్ గీశాడు. తన పాకలో రంగులు మేళవించి కుంచెతో దిద్దాలి. ఈ బొమ్మ రూపు దిద్దుకుంటే తన జన్మ తరిస్తుంది. ఆనందంతో కూడిన అశ్రువులు అతని నేత్రాలలో తొణికిసలాడాయి.

ఆమె ఎప్పుడు వెళ్ళిపోయిందో అతనికి తెలియలేదు. నన్నని నిట్టూర్పు వెలువడింది అతని నుంచి. అతను ఉదయం పది గంటల నుండి సాయంకాలం కాలం అయిదు గంటల వరకూ పొలాలలో కూలీలతో నమంగా ఉంటాడు. సాయంత్రం వాళ్ళందరికీ కూలి డబ్బులు ఇచ్చి గంగారం దగ్గరకు వచ్చి లెక్కలు చెప్పి వెళ్ళిపోతాడు.

అతని బ్రతుకులో ఉదయ సాయంనంధ్యలు ప్రముఖపాత్ర వహిస్తూ ఉంటాయి.

ఆ నమయంలో అతను ఏటి ఒడ్డున కూచుని ఊహాలోకాల్లో తేలిపోతూ ఉంటాడు. అందాల్ని అన్వేషిస్తూ ఇలా పారిపోయి వచ్చాడు. అన్వేషణ ఫలించింది. ఊహాసుందరి ఎదుట సాక్షాత్కరించింది. కాని...కాని...ఆమె...ఇతరుల సొత్తు. రహస్యంగా ఆమె అందానికి పటం గీస్తున్నాడు అతను.

వారం రోజులు గడిచాయి. ఈ వారం రోజులూ ఆమె జీడి తోటకు రాలేదు. అతను కలవర పడ్డాడు.

'ఈమెకేమైంది?'

గీ సిన చిత్రాన్ని అపురూపంగా చూసుకుంటున్నాడు. అతనిలో తన్మయత్వం చోటు చేసుకుంది. రెప్పవాల్చకుండా ఉండిపోయాడు.

అప్పుడు వచ్చింది ఆమె చుక్క తెగిపడినట్లు. అతని భుజాల మీదుగా వంగి చిత్రాన్ని చూ సింది. ఆమె ఎద పొంగింది. సౌందర్యాస్వాదనలో మునిగి తేలుతున్న అతన్ని మృదువుగా స్పృశించింది.

ఉలిక్కిపడి వెనుదిరిగాడతను. నవ్విందామె.

"చాలా రోజులై మీరు కనిపించ లేదు!" నిష్ఠూరం ధ్వనించింది అతని గొంతులో.

"నేను భర్త చాటుదాన్ని!" నన్నని నీలి తెర జారింది ఆమె ముఖంలో.

"మీ అందం అడవికాచిన వెన్నెల. ఈ పెళ్ళికి ఎలా అంగీకరించారు?" ఆదోలా ధ్వనించింది అతని గొంతు.

"జాలిపడుతున్నారా?"


"కాదు! విచారిస్తున్నాను."


"అంటే?"

"మంచి అన్నంలోకి మంచి కూర దొరకదు." విషాద భరితంగా నవ్విందామె.

"నా ప్రశ్నకి నమాధానం కావాలి నాకు."

"ఏముంది? కట్నాల మార్కెట్‌లో పెళ్ళి కొడుకుల ధరలు ఆకాశాన్ని అంటుతూ ఉంటే నాలాంటి ఆడ పిల్ల గతి ఇంతే! నా తండ్రి నిరుపేద. ఆయనకు ఉన్న ఆరుగురు ఆడ పిల్లలలోకి నేనే పెద్దదాన్ని. అప్పుడు కనిపించారు గంగారాం గారు పేద వాడికి పెన్నిధిలా. ఈ తప్పెవరిదంటారు శిల్పీ? అనిర్వచనీయమైన



బాధ తొణికిసలాడింది ఆమె గొంతులో.

అవాక్కయి చూస్తూ ఉండిపోయాడు అతను.

ఉన్నట్టుండి ఆమె అడిగింది-"అహల్య కథ మీకు తెలుసా శిల్పీ?" అని.

"గౌతమ మహర్షి కథ తెలును!"

"చిత్రంగా మాట్లాడుతారు మీరు!"

"శిల్పీ! ఇటు చూడండి!" వీపు మీద జాకెట్టు సడలించి చూపించింది. వీపు నిండా వాతలు పెట్టి ఉన్నాయి. అతను గతుక్కుమన్నాడు.

"ఏమిటివి?"

"నా భర్త నాకిచ్చిన బహుమానాలు!"

"గంగారాం గారు ఇలాంటివారా? మంచిగా కనిపిస్తారే?"

"అందరికీ మంచిగానే కనిపిస్తారు. కాని... కాని... నా వల్ల శాడిస్టు."

"నేను మీకు చెయ్యగల సాయం ఏదున్నా చేస్తాను!"

"నన్ను మీతో తీసుకుపోగలరా?"

తుళ్ళిపడ్డాడతను. క్షణకాలం ఆమె ముఖంలోకి చూస్తూ ఉండిపోయాడు.

"మాట్లాడరేం శిల్పీ?" ఈ పరిసరాలకి దూరంగా పారిపోవాలన్న తపన ఆమె అంతరాంతరాల నుంచి ప్రతిధ్వనించింది.

"ఆలోచిస్తాను!" ఆమె వీపు మీది వాతలకి కొబ్బరి నూనె పూస్తూ అన్నాడతను.

"ఏ సంగతీ రేపు, ఉదయం ఏటి ఒడ్డున చెప్పండి!" అంటూ తుర్రుమందామె.

ఆమె వెళ్ళిన వైపే చూస్తూ ఉండిపోయాడతను.

** ** **

అతనా ఊరు వచ్చి కొద్ది రోజులే అయినా ఏదో విడదీయరాని బంధం ఏర్పడింది ఆ పరిసరాలతో. ఆ జీడి తోట, ఆ ఏరు, ఆ వాతావరణం ఏదో హాయి గొల్పుతూ ఉంటుంది.

డిగ్రీ పూర్తి చేసినా ఉద్యోగం సంపాదించుకోలేని నిర్భాగ్యుడు తను. పుట్టిన నాటి నుంచీ తనతోనే పెరిగి పెద్దదవుతూన్న కళాతృష్ణ తనని విచిత్రంగా ఇక్కడ బంధించింది. గంగారాం గారి ధర్మమా అని తిండికీ, గుడ్డకీ లోటు లేకుండా పోయింది.

కాని... కాని... అహల్య తనని కోరరాని కోరిక కోరింది. తను ఈ సాహసం చెయ్యగలడా? నాలుగు రోజులు గడిచాయి.

ఈ నాలుగు రోజులూ అహల్యకి మొహం చాటుచేశాడు. అహల్య తనని పిరికివాడుగా భావిస్తుందా?

అతని మస్తిష్కం మొద్దుబారిపోయింది.

తనిప్పుడు ఏ నిర్ణయం తీసుకోవాలి? తనకు తానుగా అందివస్తున్న సౌందర్యరాశి! తన కళా తపనకి ఆలంబన. ఆమెని స్వీకరించాలన్న దృఢమైన నిర్ణయం అతని అంతరంగంలో చోటు చేసుకుంది.

మర్నాడు ఉదయం ఆమె ఏటికి వచ్చినప్పుడు చెప్పాడు అతను. "ఈ రాత్రికి మనం వెళ్ళిపోదాం! సరిగ్గా పన్నెండు గంటలకి రండి!"

ఆమె ముఖంలో కోటి జ్యోత్స్నల కాంతులు వెల్లివిరిశాయి.

తనతో ఇక్కడికి తెచ్చినది ఏమీ లేదు. అపురూపంగా, మనోజ్ఞంగా చిత్రించిన చిత్రం మాత్రం ఉంది. దాన్ని గుడ్డలలో చుట్టి భద్రపరిచాడు.

గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

అహల్య కోసం ఎదురు చూస్తున్నాడు అతను. అహల్య రాలేదు. కానీ... గంగారాం వచ్చాడు.

"కుర్రాడా! వెళ్ళిపోతున్నావటగా?"

ప్రశ్నార్థకంగా చూశాడు శిల్పి.

"నాకు తెలును! అహల్య ప్రవర్తన పసిగట్టాను. సంఘంలో నా పరువు తియ్యొద్దు. ఇవి చేతులు కావు కాళ్ళనుకో! ఈ డబ్బు తీసుకుని పారిపో! మళ్ళీ ఎప్పుడూ కనిపించకు. దాన్ని గదిలో కట్టేసి వచ్చాను." వెనుదిరిగి చూడకుండా నడిచాడు గంగారాం.

చేష్టలుదక్కి చూస్తూ ఉండిపోయాడు అతను. అతని చేతిలో నోట్ల కట్ట అతనికి ఎన్నో కొత్త అర్థాలు చెప్తోంది. భవిష్యత్తు బంగారు రంగుల కలలా కనిపిస్తోంది. తుదిసారిగా ఆ ఊరికి వీడ్కోలు చెప్పి కదిలాడు.

** ** **

ఆరు నెలలు గడిచిన తరువాత అహల్య పేర ఒక ఉత్తరం వచ్చింది. ఆత్రుతగా విప్పి చూసింది. అది శిల్పి దగ్గర నుంచి వచ్చింది.

"అహల్యా!

ఆ రోజు అలా పారిపోయి వచ్చినందుకు మీరు నన్ను అసహ్యించుకుంటారని నాకు తెలును కాని అవసరం, స్వార్థం - నా నిర్ణయాన్ని మార్చుకునేలా చేశాయి.

గంగారాం గారి మూడవ భార్యగా మీ పరిస్థితి నాకు తెలును. కాని... ముసలి తల్లిదండ్రులు, పెళ్ళి కాని చెల్లెళ్ళు ఇవన్నీ నన్ను మీ నుంచి దూరం చేశాయి.

ఆనాటి రాత్రి మీకోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నాను. మీరు రాలేదు - గంగారాం గారు వచ్చారు. ఆయన నాకు యాభై వేలిచ్చారు. క్షణాలలో నా నిర్ణయం మారిపోయింది. మీకు అందనంత దూరం పారిపోయాను. మీరు నన్ను శపిస్తారని తెలును. కానీ ఏమీ చెయ్యలేని నిస్సహాయుణ్ణి.

అహల్యా! ఇంకొక్క విషయం - ఆనాడు మీ మనోజ్ఞ రూపాన్ని చిత్రం గీశాను. మీకు గుర్తుండే ఉంటుంది. అది అఖిల భారత చిత్ర కళా పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకుంది? యాభై వేల రూపాయల నగదు బహుమతి గెలుచుకుంది. ఇప్పుడు నేను లక్షాధికారిని.

అహల్యా! ఒక్క విషయం మరిచాను - చిత్రం పేరు 'స్వప్న రాగిణి.'

ఇక ఉంటా!

మీకు ఎప్పటికీ, ఏమీ కాని శిల్పి.

ఉత్తరం చదవడం ముగించిన అహల్య కళ్ళ నుంచి వెచ్చని నీటి బిందువులు జల జల రాలాయి. ★

## రాళ్ళు

"తెల్లని గులకరాళ్ళు ఎక్కడుంటాయి రాజూ?" పూర్ణిమ టీచర్ అడిగింది. "రేషన్ బియ్యంలో టీచర్" రాజు జవాబు.

-ఉప్పుగంటి

కాలం కథ

# బిజినెస్

గణగణ టెలిఫోన్ మోగింది.

"హల్లో! ఆనంద్ స్పీకింగ్" అన్నాడు వెంటనే వెళ్ళి రిసీవర్ పైకెత్తి.

"గుడ్ మార్నింగ్ డార్లింగ్-అనితా స్పీకింగ్."

"వెరి గుడ్ మార్నింగ్ అనితా డార్లింగ్! నీకే నేను ఫోన్ చేద్దామనుకుంటున్నాను."

"థాంక్యూ."

"నిన్న మా డాడీ మీ ఇంటి కొచ్చారటగా డార్లింగ్?"

"అవును, అది చెప్పడానికే ఇప్పుడు మీకు ఫోన్ చేసింది. మీ నాన్నగారు తన మంకు పట్టు విడవడం లేదు. ఇంకా బేరం చేస్తూనే ఉన్నారు."

"అంటే?" ఆత్రతగా అడిగాడు. ఆనంద్.

"ఏముంది? మూడు లక్షల కట్నానికి పైసా కూడా తగ్గనంటున్నారు."

"మరి మీ నాన్న గారేమంటున్నారు?"

"ఏమంటారు? అంత డబ్బు ఇవ్వనంటున్నారు."

"మరెలా?"

"అంటే మన ప్రేమకు కొలమానం డబ్బేనంటారా? డబ్బుకు మించిన అనుబంధం మనిద్దరి మధ్య ఇంకేం లేదంటారా?"

"ఎలా అంటాను? మన పవిత్ర ప్రేమ మాటేమిటి?"

"అయితే, మనం స్వతంత్రించి పెళ్ళి చేసుకుందాం. ప్రేమనేది డబ్బుతో కొనే వస్తువు కాదనీ, పెళ్ళనేది సంతలో జరిగే వ్యాపారం కాదనీ, ఇదొక అపురూపమైన అనుబంధమనీ మన పెద్దలకు తెలియజేద్దాం."

"అనితా డార్లింగ్ తొందరపడకు!"

"మరి గత్యంతర మేమిటి?"

ఏముంది? మెల్లగా మీ డాడీకి నచ్చచెప్పు డార్లింగ్."

"ఆ పని మీరే చెయ్యొచ్చు గదా డార్లింగ్!"

"........"

"ఆనంద్, ఇంతకూ మీ అభిప్రాయ మేమిటి?"

"ఏముంది డార్లింగ్? మా నాన్న డబ్బు మనిషి-డబ్బు విషయంలో ఆయన రాజీపడే ప్రసక్తే లేదు. అ... అందుకే..."

"మరి మీరేమంటారు?"

"నేను అస్వతంత్రుణ్ణి-ప్లీజ్! ఎలాగైనా మీ డాడీని ఒప్పించు డార్లింగ్!"

"మా నాన్న పక్కా బిజినెస్ మాన్. ఆయన మీకు రేటు కట్టాడు. ప్రస్తుతం మార్కెట్ రేట్ల ప్రకారం మీ రంత పలకరట. మూడు లక్షలకు మీకంటే అందగాణ్ణి, విద్యావంతుణ్ణి, ధనవంతుణ్ణి కొనుక్కోవచ్చునని మా డాడీ బల్లగుద్ది చెప్తున్నారు." తపీమని ఫోన్ పెట్టేసింది అనిత.

యస్పార్ తురగా